ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్
- ఘనంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు
- నమూనా చెక్కుల పంపిణీ

రెడ్డిగూడెం: వైఎస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు బాసటగా నిలుస్తోందని మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో భాగంగా రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయం అవరణలో సోమవారం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రెడ్డిగూడెం మండలంలో 1004 పొదుపు సంఘాల అక్కా చెల్లెమ్మలకు రూ. 8,74,22,933 మూడో విడత నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. మూడు విడతల్లో ఒక్క రెడ్డిగూడెం మండలంలోనే రూ.26.22 కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. పాదయాత్రలో పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన హామీ నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కర రెడ్డి, ఎంపీపీ రామినేని దేవిప్రవణ్య, వైస్ ఎంపీపీలు చాట్ల రాబర్టు, పాటిబండ్ల శ్రీనివాసరావు, సర్పంచ్ మల్లాది రాణీ, మండల వైసీపీ అధ్యక్షులు బలగాని తిరుపతిరావు, సచివాలయ కన్వీనర్ల మండల కో ఆర్డినేటర్ భరత్‌కుమార్‌రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, డ్వాక్రా మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిగూడెంలో ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

1186 పొదుపు సంఘాలకు రూ.9.21కోట్లు

మైలవరం: మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు సోమవారం వైఎస్సార్ ఆసరా నిధులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మైలవరం మండలంలో 1186 డ్వాక్రా గ్రూపుల్లో అక్కాచెల్లెమ్మలకు రూ.9,21,06,389 నిధులు వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద విడుదలయ్యాయన్నారు. మొత్తం మూడు విడతల్లో ఒక్క మైలవరం మండలానికి రూ.27.60 కోట్లు విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వం పాలనలో నిర్వీర్య దశలో ఉన్న పొదుపు సంఘాలకు వైఎస్సార్ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు జీవం పోశాయన్నారు. ముందుగా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిమకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఇస్త్రావత్ ప్రసన్నరాణిస్వామి, జెడ్పీటీసీ ఎస్.తిరుపతిరావు, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జీ వెంకట్రావు, సచివాలయ కన్వీనర్ల మండల కోఆర్డినేటర్ చామల సీతారామిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం


ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక గ్రూపు మహిళలకు మూడో విడత ఆసరా పథకం కింద మండలంలోని 1228 గ్రూపులకు 12,956 మంది సభ్యులకు రూ.43,04,70,561 జమచేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో పాలన కొనసాగు తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు మంజూరు చేయటంతో పాటు కాలనీ ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధు పాటి నాగమల్లేశ్వరి, సమైఖ్య నాయకురాలు సీత, కేడీసీసీబీ డైరెక్టర్ రాణి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, తహసీల్దార్ కె.లక్ష్మీ, ఏపీఎం జమలయ్య పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: మహిళా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఆశయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, 45 సంవత్సరాల వయస్సు వారికి రూ.18,750, సున్నా వడ్డీ పథకం, డ్వాక్రా రుణాల మాఫీతో మహిళలను ఆర్థికంగా నిలబెట్టిన ఘనత ఒక్క జగన్‌కే దక్కిందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామన్న ఆలోచనతో టీడీపీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలకు డబ్బు ఎర చూపి ఎమ్మెల్సీ గెలవడం గొప్పా అని ఎద్దేవాచేశారు. తామొస్తే పథకాలు రద్దు చేస్తామని చెబుతున్న చంద్రబాబు పొత్తుల్లేకుండా పోటీ చేసే దమ్ముందా అని అనడంతో.. లేదు.. లేదంటూ మహిళలు బదులిచ్చారు. దాదాపు 10 వేల మంది మహిళలు థ్యాంక్యు సీఎం, థ్యాంక్యు ఎమ్మెల్యే అంటూ నినదించడంతో సభా ప్రాంగణం మార్మోగింది. రాబోయే ఎన్నికల్లో జగన్ ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని ఆయన కోరారు. రూ.11,883 మంది సభ్యులకు రూ.8.90 కోట్లు చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి, గ్రామ సర్పంచ్ దామెర ఉషా, ఎంపీపీ లంకా నిర్మల, ఎంపీటీసీ సంకు శివకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, వైస్ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, పార్టీ మండల నాయకులు చెలికాని బాబ్జి, దామెర ప్రసాదు బాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓ ఎస్ మురళీ మోహనరావు, తహసీల్దార్ విశ్వనాధరావు, పల్లె రవీంద్రరెడ్డి, డి.రాజశేఖర్, ఏపీఎం శేఖర్ పాల్గొన్నారు.


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప అప్పారావు

ఇంటింటికీ వైద్య సేవలే లక్ష్యం

నూజివీడు: ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్టులో భాగంగా ఇంటింటికీ వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం అదనంగా మరో రెండు 104 వాహనాలను అందజేసిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు, ఆగిరిపల్లి మండలాలకు ప్రభుత్వం కేటాయించిన 104 వాహనాలను సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే డాక్టర్లను పంపించి ఆరోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టారని వివరించారు. అంకిత భావంతో పనిచేయాలని కోరారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, రామిశెట్టి మురళీకృష్ణ, శీలం రాము, పిళ్లా చరణ్, యనమదల సర్పంచ్ వరికూటి వెంకటేశ్వరరావు, నాయకులు పల్లె రవీంద్ర రెడ్డి, ఆరేపల్లి రాంబాబు, పామర్తి రాధాకృష్ణ, ముల్లంగి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

తిరువూరు: ఇటీవల అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘ నాయకులు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. మామిడి, మొక్కజొన్న పంటలకు వర్షాల కారణంగా నష్టం వాటిల్లిందని, చేతి కందే దశలో నేలరాలని పంటలకు పరిహారం చెల్లించాలని రైతుసంఘ నాయకులు సాంబారు వెంకటేశ్వర్లు, మరసకట్ల ప్రభాకరరావు, ఎస్‌వీ భద్రం కోరారు.

మైలవరం: ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన మామిడి, మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యురాలు వజ్రాల ధనలక్ష్మి డిమాండ్ చేశారు. మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో తహసీల్దారు ఎమ్. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం నాయకులు రావూరి రమేష్‌బాబు పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: నల్లనల్లి కారణంగా నష్టపోయిన మామిడి, మొక్కజొన్న, మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలురైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. స్థానికి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గువ్వల సీతారామిరెడ్డి మాట్లాడుతూ మామిడి రైతులు వరుసగా మూడు సంవత్సరాలుగా నష్టాన్ని సవిచూస్తున్నారన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు సంభందించి రైతులకు రావల్సిన బకాయిలను వెంటనే వారి బ్యాంక్ ఖాతాలకు జమచేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వైపిచ్చిరెడ్డి, వ్యవసాయాధికారి బీ సాయిశ్రీలకు వినతిపత్రం అందజేశారు. ఆయా సంఘాల నాయకులు సీహెచ్ వీరారెడ్డి, ఎం.వెంకటరెడ్డి, పీ ఆంజనేయులు, జే వెంకటేశ్వరరావు, ఎం.గోపి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి కార్మికులకు భద్రత ప్రమాణాలు పెంచాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఎన్టీటీపీఎస్ గేటు వద్ద కరపత్రాలు ప్రదర్శించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 18న లిఫ్ట్ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించిన ఘటనలో లిఫ్ట్ తయారీ దారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు కనీసం పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. మండల కార్యదర్శి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

నూజివీడు: స్పందన అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం వద్దని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం న్విహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 10 అర్జీలు అందాయన్నారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు సంబంధించినవే ఉన్నాయని తెలిపారు. ఈ అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందనలో డీఎల్‌పీఓ పి.వెంకటరత్నం, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్, ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు, హెచ్ఓ హేమ తదితరులు పాల్గొన్నారు.

మూడు అర్జీలు స్వీకరణ..

గంపలగూడెం: స్థానికి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. సత్యాలపాడుకు చెందిన బుడుపుల ఆదిలక్ష్మి పాస్ పుస్తకంలో పొలం వివరాలు సక్రమంగా నమోదు కాలేదని సరిచేయాలంటూ దరఖాస్తు ఇచ్చింది. తనకు, తన పిల్లలకు రేషన్‌కార్డు మంజూరు చేయాలంటూ కనుమూరుకు చెందిన రేగళ్ల భవాని దరఖాస్తు అందజేసింది. కొత్తపల్లి రైతుభరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులుగా వ్యవహరిస్తున్న పున్నయ్య విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామంటూ కొందరు రైతులు ఫిర్యాదు ఇచ్చారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఏఓ బీ సాయిశ్రీ, గృహనిర్మాణశాఖ ఏఈ కిషోర్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగరాజులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

రెడ్డిగూడెం: మండలంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన మామిడి రైతులకు ఎకరానికి రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రెడ్డిగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.పాల్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మద్దిరెడ్డి మాధవరెడ్డి మాట్లాడుతూ మామిడి పంటలకు పూత దశలోనే నల్లనల్లి, తామర పురుగు, తేనేమందు లాంటి వాటి వలన మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి బొల్లారెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, జంగా వెంకటరెడ్డి, రామిరెడ్డి, ముప్పిడి లక్ష్మారెడ్డి, పెద్ద వెంకటరెడ్డి, పాములపాటి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవు

కనిమెర్ల తండా(మైలవరం): వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని ఆంధ్రా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ అచ్యుతబాబు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని, భోజనం, ఇతర పదార్థాలు తినే సమయంలో చేతులు శుభ్రంగా ఉండాలన్నారు. 80 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.శివహరిప్రసాద్, వలంటీర్‌లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నూజివీడు: స్థానిక ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం మండలంలోని సుంకొల్లులో సోమవారం ఐదో రోజు కొనసాగింది. బాలికావిద్య ఆవశ్యకత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. 18 ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని, లఘునాటికల ద్వారా వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రోడ్డు మార్జిన్లలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి, సిబ్బంది భవాని, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల వితరణ

గోసవీడు (గంపలగూడెం): గోసవీడులో అక్కలమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి ఒక భక్తుడు సోమవారం రూ.50 వేలు వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు వజినేపల్లి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి ఈమొత్తాన్ని వారి ప్రథమ కుమార్తు, కోడలు వజినేపల్లి మురళీ మోహన్, రాణి దంపతుల పేరున ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గోగిరెడ్డి కృష్ణారెడ్డి, నేరెళ్ల సతీష్, సుభాష్‌లకు అందజేశారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

కలగర (విస్సన్నపేట): కలగర ఎంపీయూపీ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కోపూరి తిరుపతి రావు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.ప్రభాకరరెడ్డి సోమవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎం, పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

నెమలి(గంపలగూడెం): మండలంలోని నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగభూషణం సోమవారం తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కాశిమళ్ల నందిని, రావూరి రామ తేజస్వీని, తడికమల్ల రోహిత్, కటారు విష్ణు, చామంచుల శ్రావిక, కుంభగిరి లోకేష్‌లు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన జరిగిన పరీక్షలో వీరు మెరుగైన ఫలితాలను సాధించి ఉపకార వేతనానికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు ఎం.జయశీలన్‌రావు, పి.మహేశ్వరిలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటి పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

ఇబ్రహీంపట్నం: మండలం పరిధి గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ మార్చి 31తో గడువు ముగుస్తున్నందున మూలపాడు, జూపూడి, గుంటుపల్లి తదితర గ్రామాల్లో పెండింగ్ బిల్లులు గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి వసూలు చేస్తున్నారు. ఈనెలాఖరుకు నూరుశాతం వసూలు చేస్తామనే ఆశాభావం వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

గంపలగూడెం: వచ్చేనెల 3 నుంచి జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలు మొదటి సెట్ సోమవారం గంపలగూడెం పోలీస్ స్టేషన్‌కు చేరాయి. పరీక్షల నిర్వహణకు సంభందించి రూట్ ఆఫీసర్, మండల విద్యాశాఖాధికారి బీ సోమశేఖర్‌నాయక్ ఆయా సబ్జెక్టులకు సంభందించి ప్రశ్నాపత్రాలను ప్రత్యేక వాహనంలో తీసుకు వచ్చారు. వాటిని మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటల్ అధికారుల సమక్షంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చారు.

నూజివీడు: వచ్చేనెల 3వ తేదీ నుంచి నిర్వహించే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన స్టాకు పాయింట్‌కు చేరాయి. నూజివీడు పట్టణంలో ఆరు పరీక్ష కేంద్రాలు, నూజివీడు మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు ప్రశ్నపత్రాలు పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన స్టాకు పాయింట్‌లో సోమవారం భద్రపరిచారు. ప్రశ్న పత్రాల కస్టోడియన్ వీవీ ఆదిలక్ష్మి పట్టణానికి సంబంధించిన ప్రశ్నపత్రాలను భద్రపరిచారు. స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్, సెయింట్ ఆన్స్, సెయింట్ థామస్, సెయింట్ మేరీస్, లేయా జోన్స్ హైస్కూళ్లలో, మండలంలో పల్లెర్లమూడి, గొల్లపల్లి హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో 1,789 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీటిల్లో గొల్లపల్లి, పల్లెర్లమూడి పరీక్ష కేంద్రాలు సీ కేటగిరి పరీక్ష కేంద్రాలు. స్టాకు పాయింట్లలో పరీక్ష పత్రాలను భద్రపరిచే కార్యక్రమంలో ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

గోసవీడు(గంపలగూడెం): గోసవీడు మదనవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండపం, గ్రామంలో పునఃనిర్మించనున్న అక్కలమ్మ దేవాలయాల నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన గావించారు. పౌరోహితులు అరిపిరాల అప్పయ్యశాస్త్రి, పొద్దుటూరి కోటేశ్వరశర్మ, సంగయ్యల ఆద్వర్యంలో ఆయా కార్యక్రమాలకు ప్రత్యేక పూజలు గావించారు. కమిటీ సభ్యులు గోగిరెడ్డి కృష్ణారెడ్డి, పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, వజినేపల్లి వెంకటేశ్వరరావు, కోరుకొండ గోపాల్ దంపతులు పీఠలపై కూర్చొని ప్రత్యేక పూజలు గావించారు. సర్పంచ్ కందిమళ్ళ పిచ్చియ్య, ఎంపీటీసీ సభ్యులు బొమ్మారెడ్డి జయలక్ష్మి, మాజీ సర్పంచ్ కొత్తా రజనీ, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, కే బోస్, జీ వెంకటకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు నేరెళ్ళ సతీష్, సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు నేత్ర పరీక్షలు

రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడి సచివాలయంలో సోమవారం వైఎస్సార్ కంటి వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని పలువురు రోగులకు వైద్యులు నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు సిఫారసు చేశారు. డాక్టర్ ప్రవీణ్ నేత్ర సంబంధ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచి ముండ్లపాటి కాంతమ్మ, ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ బండి రవికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా సభ్యుడిగా అశోక్

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా కొటికలపూడికి చెందిన నంబూరు అశోక్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసే దేవానంద్ నుంచి సోమవారం నియామకపత్రం అందుకున్నారు. బీజేపీ నాయకులు అశోక్‌ను అభినందించారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

నూజివీడు: పదో తరగతి ఉత్తీర్ణత, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులైనా, ఫెయిలైన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ కోసం ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రధానాధికారి దేవరకొండ భూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 08656 232711లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 51 మంది గైర్హాజరు

తిరువూరు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలు తిరువూరులోని మూడు కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 317 మందిని కేటాయించగా 288 మంది పరీక్షకు హాజరయ్యారు. 29 మంది గైర్హాజరయ్యారు. నాగార్జున జూనియర్ కళాశాల కేంద్రంలో 253 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 244 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల లో 370 మందికి గాను 357 మంది పరీక్ష రాశారు. 13 మంది గైర్హాజరయ్యారు.

ఇంటర్ పరీక్షలకు 42 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం భౌతికశాస్త్రం, ఎకనామిక్స్ పరీక్షలకు సోమవారం 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో కలిపి 1376 మంది విద్యార్థులకు 1334 మంది హాజరయ్యారు. ఆయా కళాశాలలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా ఐ.గిరిదేవి, ఈదర కోటేశ్వరరావు, ఎస్. వెంకటలక్ష్మి, కె.సంధ్యాజ్యోతి వ్యవహరించారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన

గంపలగూడెం: రక్తహీనతతో అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని సూపర్వైజర్ రేవతి సూచించారు. పోషకాహార పక్షోత్సవాలలో భాగంగా గంపలగూడెం లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్, పెనుగొలను అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తగిన పోషకాలు ఉన్న చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా రక్తహీనత గురికాకుండా ఉండవచ్చుఅన్నారు. వివిధ రకాల ఆకుకూరలు, మునగాకు విశిష్టతను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పెనుగొలను సర్పంచ్ సంగెపు లలిత, అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

జి.కొండూరు: గర్భవతులు, బాలింతలు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్లన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ శ్రీకల్యాణి, సెక్టారు సూపర్‌వైజర్ అన్నమ్మ, అంగన్‌వాడీ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ఆగిరిపల్లి: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి అన్నారు. మండలంలోని వడ్లమాను ప్రాథమికోన్నత పాఠశాల, ఆగిరిపల్లి, ఈదులగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పోషణ్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా పోషకాహార లోపం వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. చిరు ధాన్యాల వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. హెచ్ఎంలు పుష్పలత, హరిశరణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత తండ్రికి ఎమ్మెల్యే నివాళి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గొట్టిముక్కల కోటేశ్వరరావు తండ్రి వెంకయ్య (68) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్వగృహానికి చేరుకుని వెంకయ్య మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

అంగన్‌వాడీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: ఐసీడీఎస్ మైలవరం ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తల పోస్టులు-2, సహాయకులు-6 పోస్టుల భర్తీకి ఏప్రిల్ 4వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని సీడీపీఓ పుష్పలత సోమవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి పంచాయతీ ఏరియాలో అంగన్‌వాడీ కార్యకర్త (జనరల్), రెడ్డిగూడం మండలం మద్దులపర్వ (బీసీ-డీ), మైలవరం-2 అంగన్‌వాడీ సహాయకురాలు (జనరల్), కొత్త మంగాపురం (బీసీ-డీ), అనంతవరం (ఎస్టీ), జీ.కొండూరు మండలం చెవుటూరు-1 (జనరల్), కవులూరు-4 (జనరల్), ఇబ్రహీంపట్నం మండలం దొనబండ (బీసీ-ఏ) కేటగిరీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై 1, 2022 నాటికి వయసు 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టుకు 10వ తరగతి పాసయి ఉండాలి. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ముసునూరు: ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం తోపాటు, కేసులు నమోదు చేస్తామని ఇంటర్నల్ తనిఖీ అధికారిణి, ఏడీఏ జి.వెంకట రమణి హెచ్చరించారు. మండలంలోని చెక్కపల్లిలో భాగ్యశ్రీ ఎంటర్ ప్రైజెస్, మన గ్రోమోర్ ఎరువుల దుకాణాలను సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో ఎంఏవో సీహెచ్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఆగిరిపల్లి: మండలంలోని సీతారామపురంలో కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎన్.చంటిబాబు సోమవారం తెలిపారు. వీరి నుంచి రూ.3500, కోడి పుంజు, కత్తిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

భవన నిర్మాణ కార్మిక సంఘ నూతన కార్యవర్గం

తిరువూరు: మండల భవన నిర్మాణ కార్మిక సంఘానికి సోమవారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవికి నల్లగొర్ల వేలాద్రి, పమ్మి రామారావులు పోటీ పడగా, వేలాద్రి 274 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. గౌరవ ధ్యక్షుడిగా వేముల నరసింహారావు, గౌరవ సలహాదారుగా మాబూ సాహెబ్‌లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన వేలాద్రిని సంఘ సభ్యులు అభినందించారు. 2 సంవత్సరాల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది.